తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
16 మార్చి 2026
సంపుటి 03
సంచిక 158
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# అన్ని మతాలు కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి

- ఇఫ్తార్ విందులో సీఎం పిలుపు
- మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబాటు
- ఎల్బీ స్టేడియంలో ఘనంగా రంజాన్ ఇఫ్తార్ విందు

**హైదరాబాద్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** రాష్ట్రంలో అన్ని మతాలకు చెందిన ప్రజలు కలిసికట్టుగా సోదరభావంతో జీవిస్తూ తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసం కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా విలువలను గుర్తుచేసే పవిత్ర సమయం అని పేర్కొన్నారు. నెల రోజులపాటు ఆత్మశుద్ధితో జీవిస్తూ ఇతరులకు సహాయం చేయడం, పరస్పర సత్సంబంధాలను కొనసాగించడం రంజాన్ మాసం యొక్క గొప్పతనమని ఆయన అన్నారు. సమాజంలో ఐక్యత, సఖ్యత పెంపొందించడంలో ఈ పండుగ ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మైనారిటీల



అభ్యున్నతికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. మైనారిటీలకు అవకాశాలు కల్పించేందుకు అనేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి, షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు అప్పగించినట్లు గుర్తుచేశారు. అలాగే క్రికెటర్ సిరాజ్, బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌లకు డీఎస్పీ ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు ఆర్థిక సహాయం అందించినట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా ఎనిమిది మంది

➢ మిగతా 2వ పేజిలో..



## రైతు భరోసా నిధుల విడుదలకు సిద్ధం

- మార్చి 22న తొలి విడత నిధులు విడుదల
- 70 లక్షల రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు జమ
- మూడు విడతల్లో దాదాపు రూ.9,000 కోట్లు విడుదల

**హైదరాబాద్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద తొలి విడత నిధులను ఈ నెల 22న విడుదల చేయాలని నిర్ణయించింది. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయనున్నారు. రైతులకు ఆర్థిక సహాయం త్వరగా అందేలా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆర్థిక సహాయం సమయానికి అందేలా విడతల వారీగా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. మొదటి విడతలో సుమారు 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. ఒక ఎకరం వరకు భూమి ఉన్న రైతులకు ఈ విడతలో రైతు భరోసా నిధులు

➢ మిగతా 2వ పేజిలో..

## సిద్దిపేట ప్రజల సేవలోనే ఉంటా: హరీశ్‌రావు

- రంజాన్ తోఫాల పంపిణీలో మాజీ మంత్రి పాల్గొనం
- సిద్దిపేట అభివృద్ధిపై హరీశ్‌రావు వ్యాఖ్యలు
- కాంగ్రెస్ హామీలపై విమర్శలు



**సిద్ధిపేట, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** తనలో శక్తి ఉన్నంత వరకు సిద్దిపేట ప్రజల సేవలోనే కొనసాగుతానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు స్పష్టం చేశారు. సిద్దిపేట అభివృద్ధికి ప్రజల ఆశీర్వాదమే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సిద్దిపేట విద్య, వైద్య రంగాల్లో ముందంజలో నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వెయ్యి పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. సిద్దిపేట మిలాన్ గార్డెన్‌లో సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఫౌండేషన్ అధినేత సాదాత్ నజీర్ సేవలను ఆయన ప్రశంసించారు. నిరుపేదలకు కుల, మత భేదాలు లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అవసరమైన వారికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. పండుగల సమయంలో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో మైనారిటీల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు. షాదీ ముబారక్ పథకం ద్వారా పేద ముస్లిం కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగితే 13 వేల రూపాయల ఆర్థిక సాయంతో

➢ మిగతా 2వ పేజిలో..

## డ్రగ్స్ కేసుపై కేటీఆర్ సమాధానం చెప్పాలి: మహేశ్ కుమార్ గౌడ్

- మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఘటనపై రాజకీయ దుమారం
- అసెంబ్లీలో ప్రజా ప్రతినిధులందరికీ డ్రగ్స్ పరీక్షలు చేయాలనే సవాల్
- డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యాఖ్య



**హైదరాబాద్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ కేసు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు ఆయన బృందం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. డ్రగ్స్ వంటి తీవ్రమైన అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈగల్ బృందం రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహిస్తూ డ్రగ్స్ సరఫరా,

➢ మిగతా 2వ పేజిలో..

## డ్రగ్ టెస్ట్‌కు సిద్ధం.. కేటీఆర్ స్పష్టం

- మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై తీవ్ర స్పందన
- అన్ని పార్టీల నేతలు కూడా పరీక్షలు చేయించుకోవాలని సూచన
- ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక



**హైదరాబాద్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** రాష్ట్రంలో డ్రగ్స్ అంశంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. బాధ్యత గల ప్రజా ప్రతినిధులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రజల ముందు ఆదర్శంగా ఉండాల్సిన నాయకులు డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను తీసుకోవడం అత్యంత సిగ్గుచేటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవలి కాలంలో తన పేరును అనవసరంగా డ్రగ్స్ కేసులతో అనుసంధానం చేయడం సరైంది కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం ఇలా ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని కేటీఆర్ పేర్కొన్నారు. తాను ఎలాంటి డ్రగ్ పరీక్షకైనా సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ స్పష్టంగా ప్రకటించారు. అవసరమైతే తాను వెంటనే పరీక్ష చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అదే విధంగా అన్ని రాజకీయ

➢ మిగతా 2వ పేజిలో..




## సరిహద్దుల్లో సమర శంఖం

- డ్రోన్ల నిఘాలో సరిహద్దులు..
- స్వదేశీ అస్త్రాలతో భారత్ పహారా!
- భారత్-చైనా వాస్తవాధీన రేఖ వెంబడి పెరిగిన డ్రోన్ల నిఘా మరియు సైనిక మోహరింపు
- రక్షణ రంగంలో స్వయం సమృద్ధి
- సరిహద్దులకు చేరుకున్న స్వదేశీ క్షిపణులు మరియు తేజస్ యుద్ధ విమానాలు

➢ 2వ పేజిలో..

## ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరుతున్నాయా?

- సంక్షేమ పథకాల లక్ష్యం మరియు ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితి
- అమలులో ఎదురవుతున్న సాంకేతిక, రాజకీయ మరియు పరిపాలనా సవాళ్లు
- పారదర్శకత కోసం కావాల్సిన సంస్కరణలు మరియు భవిష్యత్తు కార్యాచరణ

**డెస్క్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, వారి ఆర్థిక స్వావలంబనకు ప్రధాన సోపానాలుగా నిలవాలి. ప్రతి ఏటా బడ్జెట్‌లో కోట్లాది రూపాయల నిధులను వివిధ పథకాల కోసం కేటాయిస్తున్నప్పటికీ, అవి ఆశించిన స్థాయిలో క్షేత్రస్థాయికి చేరుతున్నాయా అన్నది ఎప్పుడూ

➢ మిగతా 2వ పేజిలో..

# అన్ని మతాలు కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి

➤ మొదటి పేజీ తరువాయి



మైనారిటీ నాయకులను వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించినట్లు సీఎం వెల్లడించారు. విద్యా రంగంలో కూడా మైనారిటీలకు అవకాశాలు కల్పిస్తూ ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో ప్రత్యేక సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో మైనారిటీలకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ రంజాన్ పండుగ ప్రజల్లో సఖ్యత, సోదరభావం పెంపొందించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లు అందరూ కలిసి మత సామరస్యంతో రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం మనందరిదని, అందరం కలిసి కష్టపడితేనే రాష్ట్రం మరియు దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు, మైనారిటీ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధుల విడుదలకు సిద్ధం

➤ మొదటి పేజీ తరువాయి

అందనున్నాయి. నిధులు నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ అయ్యేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు.మొదటి విడత విడుదలైన 20 రోజుల తర్వాత రెండో విడత నిధులను విడుదల చేయనున్నారు. ఈ దశలో సుమారు రూ.2,650 కోట్లను రైతుల ఖాతాల్లోకి బదిలీ చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అలాగే ఏప్రిల్ నెలాఖరులోగా మూడో విడత నిధులను కూడా విడుదల చేసి మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మూడు విడతల్లో కలిపి దాదాపు రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులు రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి చేరనున్నాయి.

## సిద్దిపేట ప్రజల సేవలోనే ఉంటా: హరీశ్‌రావు

➤ మొదటి పేజీ తరువాయి

పాటు కేసీఆర్ కిట్ అందించేవారని చెప్పారు. అలాగే ఇమామ్‌లు, మోజోన్లకు జీతాలు ఇచ్చిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని భావించి రాష్ట్రవ్యాప్తంగా 204 మైనారిటీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు హరీశ్‌రావు తెలిపారు. ఈ పాఠశాలల్లో నమాజుతో పాటు ఇంగ్లీష్ మాధ్యమంలో నాణ్యమైన విద్య అందించామని అన్నారు. ఒక్కో విద్యార్థిపై లక్ష రూపాయల వరకు ఖర్చు చేసి కార్పొరేట్ పాఠశాలలకు సమానంగా విద్య అందించామని తెలిపారు. ఈ గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు మాత్రమే కాకుండా ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అబద్ధపు హామీలు ఇచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లక్ష అరవై వేల రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. ఇమామ్‌లు, మోజోన్ల జీతాలు పెంచుతామని చెప్పినా ఒక్క రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు. కొత్త పథకాలు ప్రవేశపెట్టకపోగా గతంలో అమలులో ఉన్న పథకాలను కూడా నిలిపివేస్తోందని రేవంత్ ప్రభుత్వంపై హరీశ్‌రావు మండిపడ్డారు.

## డ్రగ్స్ కేసుపై కేటీఆర్ సమాధానం చెప్పాలి: మహేశ్ కుమార్ గౌడ్

➤ మొదటి పేజీ తరువాయి

వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ చర్యల్లో ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యం లేదని, సమాజాన్ని డ్రగ్స్ ముప్పు నుంచి రక్షించడమే ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.కేటీఆర్ మరియు ఆయన అనుచరులు డ్రగ్స్ వినియోగం చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని మహేశ్ గౌడ్ ఆరోపించారు. అవసరమైతే కేటీఆర్ డ్రగ్స్ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన సవాల్ విసిరారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా అన్ని పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులందరూ డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేస్తోందని మహేశ్ గౌడ్ తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో డ్రగ్స్ సంస్కృతి పెరిగిపోయిందని ఆయన ఆరోపించారు. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటానికి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణకు కాంస్యం.. సౌత్‌జోన్ త్రోబాల్ చాంపియన్‌షిప్



హైదరాబాద్, తిరుపతి వేదికగా జరిగిన 17వ సౌత్‌జోన్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు కాంస్యం దక్కింది. ఆదివారం జరిగిన పోరులో తెలంగాణ పురుషుల జట్టు 15-9, 15-7తో కేరళపై అద్భుత విజయంతో కాంస్యం ఖాతాలో వేసుకుంది. ధీరజ్, నితిన్ సాగర్..జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారు. అంతకుముందు జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో తెలంగాణ 15-12, 15-11తో కర్ణాటకపై, పుదుచ్చేరిపై 15-6, 15-9తో గెలిచి ముందంజ వేసింది.అయితే కీలకమైన సెమీస్‌లో మన టీమ్ 11-15, 10-15తో తమిళనాడు చేతిలో ఓడి కాంస్య పోరుకు అర్హత సాధించింది. మరోవైపు మహిళల జట్టు లీగ్ దశ దాటకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. జట్టు సభ్యులను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిరణ్ చారి అభినందించారు.

# డ్రగ్ టెస్ట్‌కు సిద్ధం.. కేటీఆర్ స్పష్టం

➤ మొదటి పేజీ తరువాయి

పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు కూడా డ్రగ్ పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు సరైన సందేశం ఇవ్వాలంటే రాజకీయ నాయకులే ముందుగా ముందుకు రావాలని, డ్రగ్స్ వంటి సమస్యలపై స్పష్టమైన వైఖరి చూపాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో డ్రగ్స్ వ్యసనం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధుల బాధ్యత మరింత పెరిగిందని ఆయన అన్నారు.రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరమని కేటీఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం సమాజం మొత్తం బాధ్యత అని చెప్పారు. ప్రభుత్వం, పోలీసు విభాగం, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు కలిసి పనిచేస్తేనే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కొనగలమని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, అందుకే దీనిపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. డ్రగ్స్ కేసులు ఎక్కడైనా బయటపడితే తన పేరును లాగడం తగదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేయడం రాజకీయంగా తప్పుడు చర్య అని పేర్కొన్నారు. ఇలాంటి ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. నిజానికి ఎవరికైనా డ్రగ్స్ వ్యవహారంతో సంబంధం ఉంటే దాని మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, కానీ నిరాధార ఆరోపణలతో రాజకీయాలను కలుషితం చేయడం సరైంది కాదని ఆయన వ్యాఖ్యానించారు.

# జ్వరంతో వచ్చిన యువతిపై డాక్టర్ అసభ్య ప్రవర్తన

- భయంతో భర్తకు వాట్సాప్‌లో సమాచారం ఇచ్చిన బాధితురాలు
- ఆగ్రహంతో డాక్టర్‌పై దాడి చేసిన కుటుంబ సభ్యులు



**మహబూబాబాద్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు పట్టణంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. జ్వరంతో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన యువతిపై డాక్టర్ అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపణలు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనకు సంబంధించి యువతి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆస్పత్రి వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 21 ఏళ్ల యువతి జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం తొర్రూరులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ డాక్టర్ కిరణ్ కుమార్ ఆమెను పరీక్షించి ఇంజక్షన్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత డాక్టర్ తనతో అనుచితంగా ప్రవర్తించాడని యువతి ఆరోపించింది. ఈ ఘటనతో తీవ్ర భయానికి గురైన ఆమె వెంటనే తన భర్తకు వాట్సాప్ ద్వారా సమాచారం పంపినట్లు తెలిసింది.యువతి పంపిన సమాచారంతో ఆమె భర్తతో పాటు కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ విషయంపై డాక్టర్‌ను ప్రశ్నించగా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదని, నిర్లక్ష్యంగా స్పందించాడని బాధితుల బంధువులు ఆరోపిస్తున్నారు.



దీంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు డాక్టర్‌పై దాడి చేసి దేహశుద్ధి చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆస్పత్రి వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసి, ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరుతున్నాయా?

చర్చనీయాంశమే. కాగితాల మీద అద్భుతంగా కనిపించే ప్రణాళికలు, క్షేత్రస్థాయి అమలుకు వచ్చేసరికి అనేక వడపోతలకు గురవుతున్నాయి. రాజకీయ ప్రాధాన్యతలు, అధికార యంత్రాంగం వైఫల్యాలు మరియు లబ్ధిదారుల ఎంపికలో జరుగుతున్న పొరపాట్లు పథకాల అసలు ఉద్దేశ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. సంక్షేమం అనేది కేవలం ఎన్నికల హామీగా కాకుండా, సామాన్యుడి కనీస అవసరాలను తీర్చి, వారిని పేదరికం నుండి బయటపడేసే సాధనంగా మారినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. పథకాల అమలులో ఎదురవుతున్న అతిపెద్ద సవాలు 'అర్హుల గుర్తింపు'. రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు, రైతు భరోసా మరియు గృహలక్ష్మి వంటి పథకాల్లో అర్హత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది తరచూ విఫలమవుతున్నారు. నిజమైన పేదలు, నిరాశ్రయులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు, కానీ రాజకీయ పలుకుబడి ఉన్నవారు అన్ని రకాలుగా అనుకూలత కలిగి ఉండి కూడా లబ్ధి పొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివక్ష వల్ల ప్రభుత్వాలపై ప్రజల్లో నమ్మకం సడలుతోంది. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం పూర్తిగా తొలగించి, కేవలం ఆర్థిక మరియు సామాజిక స్థితిగతుల ఆధారంగానే ఎంపిక జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కావడమే కాకుండా, సామాజిక అసమానతలు మరింతగా పెరిగే ప్రమాదం ఉంది.

నేడు దాదాపు అన్ని ప్రభుత్వ పథకాలు సాంకేతికతతో ముడిపడి ఉన్నాయి. ఆధార్ అనుసంధానం, బయోమెట్రిక్ గుర్తింపు మరియు ప్రత్యక్ష నగదు బదిలీ వంటి పద్ధతులు అవినీతిని అరికట్టడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అయితే, డిజిటల్ అక్షరాస్యత తక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఇవే సాంకేతికతలు శాపంగా మారుతున్నాయి. వేలిముద్రలు పడకపోవడం, సర్వర్ లోపాలు మరియు నెట్‌వర్క్ సమస్యల కారణంగా వృద్ధులు, వికలాంగులు తమకు రావాల్సిన పింఛన్లు మరియు రేషన్ కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. మీ-సేవ కేంద్రాల వద్ద మరియు బ్యాంకుల వద్ద ఉండే రద్దీ సామాన్యుడికి శాపంగా మారుతోంది. సాంకేతికత అనేది సేవలను సులభతరం చేయాలి తప్ప, లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఉండకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పరిపాలనాపరంగా చూస్తే, క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత పథకాల పర్యవేక్షణకు పెద్ద అడ్డంకిగా మారింది. ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శి లేదా రెవెన్యూ అధికారి పలు గ్రామాలను పర్యవేక్షించాల్సి రావడం వల్ల దరఖాస్తుల పరిశీలన నామమాత్రంగా సాగుతోంది. దీనివల్ల క్షేత్రస్థాయిలో నిజానిజాలను నిర్ధారించకుండానే నివేదికలు పంపడం జరుగుతోంది. పర్యవేక్షణ లోపం వల్ల నిధుల మళ్లింపు మరియు మధ్యవర్తుల బెడద పెరుగుతోంది. పథకం ప్రకటించినప్పటి నుండి అది లబ్ధిదారుడికి అందే వరకు ప్రతి దశలోనూ జవాబుదారీతనం ఉండాలి. అధికారుల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వ్యవస్థలో మార్పు వస్తుంది మరియు పథకాలు సజావుగా సాగుతాయి. ప్రభుత్వ పథకాలు కేవలం 'ఉచితాలు'గా మిగిలిపోకూడదు. ప్రజలకు చేపలు పట్టి ఇవ్వడం కంటే, చేపలు పట్టడం నేర్పించడం మిన్న అనే నానుడిని ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలి. విద్య, వైద్యం మరియు ఉపాధి రంగాల్లో శాశ్వత ప్రాతిపదికన మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించాలి. కేవలం నగదు పంపిణీకే పరిమితం కాకుండా, ఆ నిధులను లబ్ధిదారులు ఎలా వినియోగించుకుంటున్నారో కూడా గమనించాలి. ఉదాహరణకు, స్వయం ఉపాధి పథకాల ద్వారా రుణాలు పొందిన వారు నిజంగానే యూనిట్లు స్థాపించారా లేదా అన్నది తనిఖీ చేయాలి. కేవలం అంకెల్లో చూపించే అభివృద్ధి కాకుండా, ప్రజల జీవన ప్రమాణాల్లో వచ్చే మార్పులే ప్రామాణికంగా ఉండాలి. సంక్షేమం మరియు అభివృద్ధి సమతుల్యంగా సాగినప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా నిలకడగా ఉంటుంది.దరఖాస్తు ప్రక్రియలో ఉన్న క్లిష్టత సామాన్యులకు మరో పెద్ద సమస్య. పదుల సంఖ్యలో ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి రావడం, అవి పొందడానికి మళ్లీ వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం వల్ల చాలామంది పథకాలకు దూరంగా ఉంటున్నారు. 'సింగిల్ విండో' విధానం ద్వారా అన్ని సేవలు ఒకే చోట అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం వద్ద ఇప్పటికే ఉన్న డాటా ఆధారంగా అర్హులను ఆటోమేటిక్‌గా గుర్తించే వ్యవస్థను రూపొందించాలి. ప్రజలు కార్యాలయాలకు రావడం కాదు, పాలన ప్రజల వద్దకే వెళ్లాలి. గ్రామ సభల్లో బహిరంగంగా లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించి, ప్రజల సమక్షంలోనే అభ్యంతరాలను స్వీకరించాలి. దీనివల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పోతుంది.

సంక్షేమ పథకాల అమలులో 'సోషల్ ఆడిట్' లేదా సామాజిక తనిఖీ అత్యంత కీలకమైనది. పథకం వల్ల చేకూరిన ప్రయోజనం ఏమిటి? అది ఎవరికి అందింది? అనే విషయాలను ప్రజలే స్వయంగా సమీక్షించుకునే అవకాశం ఉండాలి. ఉపాధి హామీ పథకంలో అమలు చేస్తున్న సామాజిక తనిఖీ విధానాన్ని అన్ని ప్రధాన సంక్షేమ పథకాలకు విస్తరించాలి. దీనివల్ల నిధుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చు మరియు లబ్ధిదారుల్లో చైతన్యం వస్తుంది. పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు మరియు మీడియా కూడా ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. లోపాలను ఎత్తిచూపడంతో పాటు, సక్సెస్ స్టోరీలను కూడా ప్రచారం చేయడం ద్వారా ఇతరులకు స్ఫూర్తిని అందించవచ్చు. సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా వాడుకుంటూ ప్రజలు తమ హక్కులను కాపాడుకోవాలి. బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న లోపాలు కూడా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. చాలామందికి బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు దూరంగా ఉండటం వల్ల నగదు తీసుకోవడానికి వారు రోజుల తరబడి ఇబ్బంది పడుతున్నారు. అలాగే, కనీస నిల్వ పేరుతో ప్రభుత్వం పంపే సంక్షేమ నిధులను బ్యాంకులు కట్ చేయడంపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాల నిధుల విషయంలో బ్యాంకులు మానవీయ కోణంలో ఆలోచించాలి. కరస్పాండెంట్లను నియమించి గ్రామాల వద్దకే బ్యాంకింగ్ సేవలు అందించేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలి. నిధులు సకాలంలో మరియు పూర్తిగా లబ్ధిదారుడి చేతికి చేరినప్పుడే ఆ పథకానికి సంపూర్ణ అర్థం లభిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం కొత్త కొత్త పథకాలను ప్రకటిస్తుంటాయి, కానీ పాత పథకాల బకాయిలను విడుదల చేయడంలో జాప్యం చేస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి కీలక పథకాలకు నిధుల కొరత ఏర్పడటం వల్ల విద్యార్థులు మరియు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రకటించిన ప్రతి పథకానికి నిధుల లభ్యతను ముందే నిర్ధారించుకోవాలి. బడ్జెట్ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, వాస్తవంగా విడుదల కావాలి. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే సంక్షేమాన్ని కొనసాగించడం పాలకులకు సవాలుగా మారింది. దీనిపై దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహాన్ని రచించాలి. లేనిపక్షంలో పథకాలు కేవలం ప్రకటనలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో విఫలమయ్యే ప్రమాదం ఉంది. ముగింపుగా, ప్రభుత్వ పథకాల విజయం అనేది కేవలం పాలకుల చిత్తశుద్ధి మీదనే కాకుండా, అధికారుల బాధ్యతాయుత ప్రవర్తన మరియు ప్రజల చైతన్యం మీద ఆధారపడి ఉంటుంది. అవినీతి లేని, పారదర్శకమైన పాలన అందించడమే ధ్యేయంగా అడుగులు వేయాలి. సాంకేతికతను మానవీయ ముఖచిత్రంతో అనుసంధానించాలి. అర్హుడైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరినప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్య విజయం అవుతుంది. వ్యవస్థలోని లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ, ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ ముందుకు సాగాలి. సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి తప్ప, వారిని యాచకులుగా మార్చకూడదు. ఆ దిశగా పాలకులు, అధికారులు మరియు ప్రజలు సమన్వయంతో పనిచేయాలని ఆశిద్దాం.

# సరిహద్దుల్లో సమర శంఖం

**న్యూఢిల్లీ, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** భారత సరిహద్దుల్లో ఉద్రిక్తతలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా తూర్పు లడఖ్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకు ఉన్న వాస్తవాధీన రేఖ వెంబడి చైనా తన సైనిక కార్యకలాపాలను ముమ్మరం చేయడంతో భారత రక్షణ శాఖ అత్యంత అప్రమత్తమైంది. సరిహద్దుల్లో చైనా డ్రోన్ల సంచారం పెరగడాన్ని గుర్తించిన భారత సైన్యం, ప్రతిగా అత్యాధునిక నిఘా వ్యవస్థలను రంగంలోకి దించింది. హిమాలయ పర్వత శ్రేణుల్లో శత్రువుల కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టేందుకు అత్యాధునిక సెన్సార్లు మరియు లాంగ్ రేంజ్ కెమెరాలను అమర్చారు. గాలిలో నిరంతరం పహారా కాసే డ్రోన్లతో పాటు, గడ్డకట్టే చలిలోనూ విధులు నిర్వహించగలిగే ప్రత్యేక దళాలను సరిహద్దు పోస్టుల వద్ద అదనంగా మోహరించారు. భారత్ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోదని రక్షణ శాఖ స్పష్టమైన సంకేతాలను పంపింది. మరోవైపు, పాకిస్థాన్ సరిహద్దుల్లో డ్రోన్ల ద్వారా జరుగుతున్న ఆయుధాల సరఫరా మరియు మాదక ద్రవ్యాల చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. జమ్మూ కాశ్మీర్ మరియు పంజాబ్ సరిహద్దుల్లో శత్రువుల డ్రోన్లను గాలిలోనే కూల్చివేసే 'యాంటీ డ్రోన్ టెక్నాలజీ'ని భారీగా మోహరించారు. గత కొన్ని నెలలుగా సరిహద్దు దాటి వస్తున్న డ్రోన్ల సంఖ్య పెరగడంతో, అధునాతన రాడార్ వ్యవస్థల ద్వారా వాటిని గుర్తించి జామ్ చేసే సాంకేతికతను భారత్ స్వయంగా అభివృద్ధి చేసుకుంది. సరిహద్దు గ్రామాల ప్రజలను కూడా చైతన్యపరుస్తూ, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం అందించేలా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఉగ్రవాద మూకల చొరబాటు ప్రయత్నాలను అడ్డుకోవడంలో భారత సైన్యం కఠినంగా వ్యవహరిస్తోంది, దీనివల్ల సరిహద్దు ప్రాంతాల్లో భద్రత మరింత పటిష్టమైంది.

రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర భారత్' నినాదం ఇప్పుడు సరిహద్దుల్లో ప్రత్యక్షంగా కనిపిస్తోంది. గతంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఆయుధాలపై ఆధారపడిన భారత్, ఇప్పుడు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన యుద్ధ ట్యాంకులు, క్షిపణులు మరియు తుపాకులను సరిహద్దులకు తరలిస్తోంది. ముఖ్యంగా 'ప్రచండ్' లైట్ కాంబాట్ హెలికాప్టర్లు మరియు 'తేజస్' యుద్ధ విమానాలు సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. హిమాలయాల వంటి ఎత్తైన ప్రదేశాల్లో సులభంగా ల్యాండ్ అవ్వగలిగే మరియు శత్రువుల బేస్‌లను ఖచ్చితత్వంతో ధ్వంసం చేయగలిగే సామర్థ్యం ఈ స్వదేశీ ఆయుధాలకు ఉంది. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ రూపొందించిన సరికొత్త 'అగ్ని' క్షిపణులు మరియు 'పినాక' రాకెట్ లాంచర్లు ఇప్పుడు భారత సైన్యం అమ్ములపొదిలో ప్రధానాస్త్రాలుగా మారాయి. ఇవి శత్రువులకు గట్టి హెచ్చరికగా నిలుస్తున్నాయి.

సరిహద్దుల్లో కేవలం సైనిక మోహరింపు మాత్రమే కాకుండా, మౌలిక సదుపాయాల కల్పనలో భారత్ వేగంగా దూసుకుపోతోంది. సరిహద్దు ప్రాంతాలను కలిపే రహదారులు, వంతెనలు మరియు వ్యూహాత్మక సొరంగాలు యుద్ధ ప్రాతిపదికన నిర్మించబడుతున్నాయి. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ ప్రతికూల వాతావరణంలోనూ అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యంతో నిర్మిస్తున్న ఈ రహదారుల వల్ల సైన్యం మరియు యుద్ధ సామగ్రిని అతి తక్కువ సమయంలో సరిహద్దులకు చేరవేసే అవకాశం ఏర్పడింది. ఇది చైనాకు ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, భారత్ తన భద్రత కోసం ఈ నిర్మాణాలను అత్యవసరంగా భావిస్తోంది. సరిహద్దు గ్రామాల్లో నివసించే ప్రజలకు కనీస వసతులు కల్పించడం ద్వారా వారిని కూడా దేశ రక్షణలో భాగస్వాములను చేస్తోంది. ఈ వ్యూహాత్మక నిర్మాణాలు రాబోయే కాలంలో భారత రక్షణ కవచాలుగా మారనున్నాయి.

రక్షణ శాఖ తాజా ప్రకటన ప్రకారం, రాబోయే ఐదేళ్లలో సరిహద్దు భద్రతను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత నిఘా కెమెరాలు శత్రువుల కదలికలను స్వయంచాలకంగా గుర్తించి కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిస్తాయి. దీనివల్ల మానవ తప్పిదాలకు అవకాశం లేకుండా భద్రతను పర్యవేక్షించవచ్చు. అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి శాంతిని కోరుకుంటున్నప్పటికీ, ఏ విధమైన దుశ్చర్యలనైనా తిప్పికొట్టేందుకు భారత సైన్యం సర్వసన్నద్ధంగా ఉంది. ప్రపంచ వేదికపై భారత్ తన రక్షణ సామర్థ్యాన్ని చాటుకుంటూనే, పొరుగు దేశాలతో ఉన్న వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి మొగ్గు చూపుతోంది. అయితే, దేశ రక్షణ విషయంలో మాత్రం ఎటువంటి రాజీ పడే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. భారతీయులందరిలో స్ఫూర్తిని నింపుతూ సరిహద్దులో మన జవాన్లు కంటికి రెప్పలా కాపలా కాస్తున్నారు.

THARANGALU DAILY NEWS
సోమవారం, 16 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

- సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుధ్య కార్మికులను ఘన సన్మానం



**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 15,(తరంగాలు):**గ్రామాన్ని ఎంతో పరిశుభ్రంగా ఉంచడంలో నిత్యం శ్రమించే పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి అని సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య అన్నారు.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగాఆదివారం పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో గ్రామపంచాయతీ నందు అన్ని రకాల పనులు చేసిన కార్మికులకు అభినందనలు తెలుపుతూ గ్రామపంచాయతీ పాలకవర్గం వారికి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య, ఉప సర్పంచ్ మర్రి సుధీర్ రెడ్డి, వార్డ్ సభ్యులు తాటికాయల దివ్య , నూతన గంటి ఎల్లమ్మ , ఎడ్ల రామచంద్ర , అన్నెపు సంధ్యారాణి , గ్రామంలోని హెల్త్ సెంటర్ లో పనిచేస్తున్న ఎ ఎన్ ఎం , ఆశ వర్కర్లు, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు మార్చి 15**

మార్చి 16వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి శుభాకాంక్షలు

- టాస్క్ సి.ఓ. ఓ.సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి. మార్చ్ 15. తరంగాలు ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రం నుండి రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగ తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు,నూతనంగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైనవేం నరేందర్ రెడ్డి ని వారినివాసంలోమర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హార్దికశుభాకాంక్షలు తెలిపినఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఢ టాస్కసీ .ఓ.ఓ.సుంకిరెడ్డిాఘవేందర్ రెడ్డి ఈసందర్భంగా ఆయనమా ట్లాడుతూగౌర వనీయులు వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యునిగా ఎన్నిక కావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని,పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తారనిఆకాంక్షించారు,అలాగే కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వారి దృష్టికి తీసుకువెళ్లి, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరడం జరిగింది.



# సేవే లక్ష్యంగా ఎండ వేడిమి నుండి రక్షణగా..





**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 15,(తరంగాలు):** పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జఫర్గడ్ గ్రామ వీధుల్లో చిరు వ్యాపారం చేసుకునే నిరుపేద వ్యాపారస్తులకు లైన్స్ క్లబ్ జఫర్గడ్ వారు భారీ గొడుగులను పంపిణీ చేశామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడాల పూర్ణచందర్ తెలిపారు. వడదెబ్బ బారిన పడకుండా ఎండాకాలం దృశ్య రోడ్డు పక్కన చిరు వ్యాపారులు కంకులు, పండ్లు, చెప్పులు కుట్టుకునేవారు, చేపలు, కూరగాయలు నిత్యం అమ్ముకునేవారు నిల్వ నీడ కోసం లైన్స్ క్లబ్ గొడుగులు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్ ప్రతినిధులు జి ఎల్ టి కోఆర్డినేటర్ రోడ్డు రాజు, ఐ టి చైర్ పర్సన్ పట్టపురి శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ మెరుగు రాజు,గ్రామస్తులు, ప్రముఖ వ్యాపారస్తుడు సేవా పరులు ఎండీ కరీం,రిటైర్డ్ ఉద్యోగులు పట్టపురి సోమయ్య, జఫర్గడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# కరుణగిరిలో బహుజన్ నాయక్ కాన్షీరాం 92వ జయంతి వేడుకలు ఘనంగా





- బహుజన రాజకీయాలకు దిశానిర్దేశం చేసిన మహానేత కాన్షీరాం - దామాల సత్యం

**ఖమ్మం జిల్లా బ్యూరో/ఖమ్మం రూరల్ తరంగాలు మార్చి 15**

ఖమ్మం రూరల్ మండలం కరుణగిరిలో బహుజన్ సమాజ్ పార్టీ స్థాపకుడు బహుజన్ నాయక్ కాన్షీరాం 92వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫులే అంబేద్కర్ యువజన సంఘం మరియు తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దామాల సత్యం (రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా ఇంచార్జి) మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ స్థాపకుడు కాన్షీరాం సాబ్ చేసిన సేవలు భారత రాజకీయాల్లో చిరస్మరణీయమన్నారు. కాన్షీరాం సాబ్ లేకపోతే ఈ రోజు బహుజన రాజకీయాలకు బలమైన వేదిక ఏర్పడేది కాదని అన్నారు. అణగారిన వర్గాల రాజకీయ సాధికారత కోసం ఆయన జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు.భారతదేశ చరిత్రలో కాన్షీరాం లాంటి గొప్ప నాయకుడు అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువత ఆచరణలో పెట్టి సమాజంలో సమానత్వం సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సోమయ్య, వరద సాయకుమార్, రాజు, శ్రీను, యాకూబ్, అన్నపూర్ణ, రాణి, విజయ, లక్ష్మి తదితరులు, మహిళలు మరియు పిల్లలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్- పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి



**తరంగాలు, మార్చి:15, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ మండలం పరిధిలోని మడిపెల్లి గ్రామానికి చెందిన తేజావత్ మంగమ్మ- భీమ్ సింగ్ ల కుమారుడు రాజ్ కుమార్- వనిత ల వివాహానికి మరియు నాగారం గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కేతిరెడ్డి శ్యామ్ రెడ్డి- లక్ష్మీ ల కుమారుడు రాజేష్ రెడ్డి- మిధున ల వివాహ వేడుకలకు మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఘటిక అజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య, సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ దొనికేనా సారంగపాణి, కట్కూరి నరేందర్ రెడ్డి, కామ్రేడ్ వెంకన్న, నాగారం మాజీ సర్పంచ్ శీలం వెంకన్న, నాయకులు జల్లే సుదర్శన్, కూరపాటి నగేష్, అటికే బీరయ్య, జంగిలి రాములు, కేతిరెడ్డి నరసింహారెడ్డి, కరకాల తిరుపతిరెడ్డి, చందు నరేష్, మధు, యువ నాయకుడు శ్రవణ్ కుమార్, తిప్పని సుభాష్, అభి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ధర్నాను జయప్రదం చేయండి సీపీఐ

**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 15,(తరంగాలు):** మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశం పార్టీ కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సుధాకర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మండల కార్యదర్శి జువారి.రమేష్ పాల్గొని మాట్లాడారుఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం రోజున. రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా , ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని, ఆ యుద్ధం వలన పెరుగుతున్న గ్యాస్ ధరలు, అలాగే నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, మోడీ సామ్రాజ్యవాద అమెరికా ఇజ్రాయిల్ అనుకూల విధానం ను వ్యతిరేకిస్తూ మండల కేంద్రాశీలో పెద్ద ఎత్తున జనాలను సమీకరించి నిరసన ప్రదర్శనలు, చేయాలని పిలుపునిచ్చింది.ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి పెండ్యాల సమ్మయ్య, మహిళ సమాఖ్య నాయకురాలు ఎండీ నూర్నిషా, పార్టీ నాయకులు పెద్ద రాములు,మంద బుచ్చయ్య, అన్నెపు అజయ్,బుల్లె సాయిలు, కలకోటి యాదగిరి, అన్నెపు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

• సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



కల్వకుర్తి.మార్చి15 తరంగాలు ప్రతినిధి. కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో ఆదివారం వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుండి వందల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారని, వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి,నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ,ఉప సర్పంచ్ బసన్మోని శీను, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్,వార్డ్ మెంబర్లు గోసుల కొండయ్య,గుద్దటి కిష్టల్ ముదిగొండ కవిత రమేష్, పిల్లి దేవేందర్, రేవెల్లి మానస రాజు, సిరసనగండ్ల శేఖర్, వాణి పురుషోత్తమ చారి,రంగనాథం మల్లీశ్వరి, మారేపల్లి శ్రీను,మసిగుండ్ల వెంకటేష్ ,గ్రామస్తులుకొయ్యల పుల్లయ్య, క్యాషరప్ వెంకటయ్య,బయ్యమల్లయ్య , మట్ట నిరంజన్ గౌడ్ మట్ట శేఖర్ గౌడ్, మట్ట భరత్ గౌడ్ ,ఈదులపల్లి శ్రీను ,ఎండి బాబా తదితరులు పాల్గొన్నారు.

# గోనెల విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించిన మడత వెంకట్ గౌడ్



**ఇల్లందు ప్రతినిధి మార్చి15,( తరంగాలు)** ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గోనెల విజయలక్ష్మి, దశదిన కర్మలకు హాజరైన మడత వెంకట్ గౌడ్, వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.గోనెల విజయలక్ష్మి దశదినకర్మలో భాగంగా అక్కడికి విచ్చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ గడిపల్లి కవిత, మాజీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రస్తుత బిఆర్ఎస్ నాయకులు భూక్య దలసింగ్ నాయక్ ని మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో మామిడి శివ, అరుణ్, శేషు, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు సేవలు మరువలేనివి




**జఫర్గడ్ ప్రతినిధి,మార్చ్ 14, (తరంగాలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చివరి రోజు పారిశుద్ధ్య కార్మికులను సన్మాంచి అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ చెకప్ కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుల్ల మోహన్ రావు,ఎంపీడీవో సుమన్,డిప్యూటీ డిఎంహెచ్ఓ రాజమౌళి, డాక్టర్ సావ్య, పంచాయతీ కార్యదర్శి కనకం విజయకుమార్,వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొనడం జరిగింది.



# పాల్వంచలో మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ మార్చి 15**
పాల్వంచలోని శ్రీనివాస్ గిరి, శ్రీనివాస్ కాలనీ గుట్టపై నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుకళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులను జిల్లా కలెక్టర్ అంకిత్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యక్రమాలను మంత్రులు వీక్షించారు.

# పేదల ఆకలి తీర్చడం ఆనందదాయకం జూలూరి రమేష్ బాబు




**కల్వకుర్తి. మార్చి 15 తరంగాలు ప్రతినిధి**
కల్వకుర్తి పట్టణ కేంద్రంలో ఆకలితో అలమటిస్తున్న పేదలకు అన్నం పెట్టి ఆకలి తీర్చడం ఎంతో గొప్ప విషయమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరు రమేష్ బాబు అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా 300 మంది ప్రయాణికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా చేపడుతున్న సామాజిక సేవలు సమాజంలోని అన్ని వర్గాలకు సహాయ సహకారాలు అందిస్తున్నాయన్నారు. ప్రధానంగా ఆకలి తీర్చే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతు సేవ పదిమందికి అందించేందుకు ముందుకు రావాలని అందుకు లయన్స్ క్లబ్ ను వేదిక చేసుకోవాలని జూలూరు రమేష్ బాబు కోరారు. క్లబ్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీధర్ మాట్లాడుతూ రమేష్ బాబు దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు.

బస్టాండ్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కల్మచర్ల గోపాల్, చార్టర్ ప్రెసిడెంట్ కల్మిచర్ల రమేష్,

గుబ్బ కిషన్, బీచాని బాలకృష్ణ, జూలూరు ప్రకాష్, దార మౌని గణేష్, గోవిందు శ్రీనివాస్, కంది ప్రవీణ్, శివ జగదీశ్వర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు బాదం హరీష్, గుగ్గిళ్ళ శంకర్, మాచిపెద్ది రవి తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.




# ప్రజా పాలన – పగతి ప్రణాళికలో పంచాయతీ సిబ్బందికి సన్మానం





**ఇల్లందు ప్రతినిధి మార్చి 14,( తరంగాలు ):** ఇల్లందు మండలం బాలాజీ నగర్ పంచాయతీలో, ప్రజాపాలన --ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, బాలాజీ నగర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ కార్మికులకు హెల్త్ చెకప్, పి పి ఈ కిట్స్ అందజేశారు. అలాగే సన్మానం చేయటం జరిగినది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాయం స్వాతి, ఉప సర్పంచ్ ఈశ్వరమ్మ, వార్డు మెంబర్లు మణిబోతుల అఖిల్, శైలజ, సెక్రెటరీ కల్తి రాజు, తదితరులు ప పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితుడికి ఎల్వోసీ అందజేత

- రూ.5 లక్షల ఎల్ఓసీ కాపీనీ అందజేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఆపద కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపిన
- మలోత్ పరమేష్ కుటుంబ సభ్యులు



**హైదరాబాద్, 15 మార్చి, తరంగాలు :** క్యాన్సర్ బాధితుడికి రూ.5 లక్షల ఎల్ఓసీ కాపీనీ వరదల పేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అందజేశారు.వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి మండలం దౌలత్ నగర్ బాజీ తండాకు చెందిన మలోత్ పరమేష్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు.దీంతో చికిత్స కోసం అతడి కుటుంబీకులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ను కలువగా సీఎంఆర్ఎఫ్ కింద ఎల్వోసీ మంజూరు చేయించి,బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. మలోత్ పరమేష్ చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్యం పొందేందుకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాస క్యాంపు కార్యాలయంలో రూ.5లక్షల విలువైన ఎల్ఓసీ కాపీని ఎమ్మెల్యే నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు వైద్య పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. స్థానిక శాసన సభ్యుడిగా తన దృష్టికి వచ్చే అనారోగ్య సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని చెప్పారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే నాగరాజు కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసి తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దావత్-ఏ-ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు



**హైదరాబాద్, మార్చి 15,తరంగాలు :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్ర మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మరియు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.తొలుత ఇఫ్తార్ విందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఎమ్మెల్యే నాగరాజు కరచాలనం చేస్తూ ఆత్మీయంగా స్వాగతం పలికారు.మత సామరస్యాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ విందులో ముస్లిం పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పాలిట వరం సీఎం సహాయనిధి

- బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హైదరాబాద్, మార్చి 15,తరంగాలు :** హైదరాబాద్ లోని ఎమ్మెల్యే నివాసం నందు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ ఏనుమాముల సాయి గణేష్ కాలనీ కి చెందిన కడమంచి దీక్షిత అనారోగ్య సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో అతనికి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.5లక్షల విలువైన ఎల్ ఓ సీ కాపీని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ ఎల్ ఓ సీ ద్వారా హైదరాబాద్ నిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదల వైద్య అవసరాల విషయంలో అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, స్థానిక శాసనసభ్యుడిగా తన దృష్టికి వచ్చే ప్రతి అనారోగ్య సమస్యపై తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తూ, లక్షల రూపాయలు ఖర్చయ్యే ప్రైవేట్ ఆసుపత్రుల చికిత్సలకు వెళ్లి అప్పుల పాలుకాకుండా, ప్రభుత్వ నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో తాను అందించే ఎల్ ఓ సీ ల ద్వారా ఉచితంగా మెరుగైన వైద్యం పొందాలని సూచించారు.ఈ సందర్భంగా బాధితురాలు కడమంచి దీక్షిత కుటుంబ సభ్యులు, ఆపద్కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించడంలో కళాకారులది కీలక పాత్ర





- ఉభయ రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

**హన్మకొండ ప్రతినిధి, మార్చి 15,తరంగాలు :** సంస్కృతిని,చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించడంలో కళాకారులది కీలక పాత్ర అని ఈగ మల్లేశం అన్నారు. హన్మకొండ పబ్లిక్ గార్డెన్ లోని పద్మ శ్రీ డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ కళా ప్రాంగణంలో జె.బి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ వరంగల్ వారి ఆధ్వర్యంలో 26 వ ఉగాది పురస్కారాలు -2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉభయ రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ సమాజంలో చైతన్యాన్ని,వినోదాన్ని,సంస్కృతీ, సంప్రదాయాల ప్రాముఖ్యతను తెలియ జేదయడంలో కళాకారుల కృషి అభినందనీయం అన్నారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఈగ మల్లేశం ను మెమెంటో తో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జెబి ఆర్ట్స్ క్రియేషన్స్ అధ్యక్షులు జడల శివ, జడల హరిత, గాడిపల్లి హరిబాబు తదితరులు మరియు అధిక సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



# రూ.250 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా






- రంగారెడ్డి జిల్లాలో 2.34 ఎకరాల భూమికి ఫెన్సింగ్
- దశాబ్దాలుగా కొనసాగిన వివాదానికి పరిష్కారం
- ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు

**రంగారెడ్డి, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లోని రాంబాగ్ ప్రాంతంలో ఉన్న 2.34 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. సర్వే నంబర్లు 354/1, 354/2, 354/3లలో ఉన్న ఈ భూమి విలువ సుమారు రూ.250 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ భూమి చుట్టూ దేవాలయాలు ఉండగా మధ్యలో ఉన్న ఈ ప్రభుత్వ భూమిపై గత కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది. ఈ భూమికి ఆనుకుని సిక్కు మతస్తులకు సంబంధించిన ఒక సమాధి ఉండటంతో ఈ స్థలంపై రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఒక వర్గం ఈ భూమిని దేవాలయాలకు కేటాయించాలని కోరగా, మరో వర్గం సిక్కు సమాజానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చింది. ఈ వివాదం నేపథ్యంలో సిక్కు మతస్తులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై సరైన నిర్ణయం తీసుకోవాలని జనవరి 29న జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసి మూడు నెలల గడువు ఇచ్చింది.ఈ మధ్య కాలంలో సిక్కు మతస్తులు ఆ భూమి చుట్టూ టిన్ షీట్లతో ప్రహరీ నిర్మించి తమ ఆధీనంలోకి తీసుకోవడానికి ప్రయత్నించారు. దీంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో విషయం అధికారుల దృష్టికి వచ్చింది. మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఇరు వర్గాలతో మాట్లాడి సంబంధిత పత్రాలను పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆ భూమి ప్రభుత్వానికి చెందినదిగా నిర్ధారించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం టిన్ షీట్లతో వేసిన ప్రహరీని తొలగించి మొత్తం 2.34 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అక్కడ ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు. సిక్కు మతస్తులకు చెందిన సమాధి ఉన్న 366 గజాల స్థలాన్ని మినహాయించి మిగతా భూమి చుట్టూ ఫెన్సింగ్ చేయడంతో వివాదం తీరింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం చూపిన హైడ్రా చర్యలను స్థానికులు అభినందిస్తున్నారు.

# టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ బాధ్యతల స్వీకరణ





- కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**హైదరాబాద్, మార్చి 15,తరంగాలు :** గాంధీ భవన్‌లోని ప్రకాశం హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య ఎర్రబెల్లి స్వర్ణ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. మహిళలు రాజకీయాలు, సామాజిక రంగాల్లో మరింత చురుకుగా పాల్గొనేలా మహిళా కాంగ్రెస్ కీలక వేదికగా నిలుస్తోందన్నారు. ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతూ మహిళల సమస్యల పరిష్కారానికి బలమైన స్వరం అవుతారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళలను సంఘటితం చేసి పార్టీని మరింత బలపర్చడంలో మహిళా కాంగ్రెస్ ముందుండాలని సూచించారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ , మహిళా కాంగ్రెస్ నాయకురాలు సునీతా రావ్ , రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
సోమవారం, 16 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# వంకాయ ఆరోగ్యానికి మేలు

- పోషకాలు సమృద్ధిగా ఉన్న కూరగాయ
- జీర్ణక్రియకు సహాయపడే వంకాయ
- మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని నిపుణుల సూచన



**డెస్క్, 15 మార్చి (తరంగాలు ప్రతినిధి):** మన రోజువారీ ఆహారంలో కూరగాయలకు ప్రత్యేక స్థానం ఉంది. అందులో వంకాయ కూడా ఒక ముఖ్యమైన కూరగాయగా గుర్తింపు పొందింది. గ్రామీణ ప్రాంతాల్లో నుంచి పట్టణాల వరకు అనేక రకాల వంటకాలలో వంకాయను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. రుచితో పాటు ఆరోగ్యానికి కూడా ఇది ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. వంకాయలో పీచు పదార్థం, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో సహాయపడతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా జీర్ణక్రియను మెరుగుపరచడంలో వంకాయ పాత్ర కీలకమని పేర్కొంటున్నారు. పీచు పదార్థం ఎక్కువగా ఉండటంతో కడుపు ఆరోగ్యాన్ని కాపాడటానికి ఇది ఉపయోగపడుతుందని చెబుతున్నారు. వంకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఇది రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడంలో కూడా ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువు నియంత్రణలో ఉన్నవారికి కూడా వంకాయ మంచి ఆహారంగా భావిస్తారు. అయితే వంకాయను కూడా మితంగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని వ్యక్తులకు వంకాయ తింటే అలర్జీ లేదా జీర్ణ సమస్యలు కలిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అందువల్ల సమతుల ఆహారంలో భాగంగా వంకాయను ఇతర కూరగాయలతో కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# పాల ప్రాముఖ్యతపై నిపుణుల సూచనలు

- శరీరానికి పోషకాలు అందించే పాలు
- ఎముకల బలానికి కీలకమైన ఆహారం
- ప్రతి రోజు మితంగా తీసుకోవాలని సూచన



**డెస్క్, 15 మార్చి (తరంగాలు ప్రతినిధి):** మన రోజువారీ ఆహారంలో పాలు ముఖ్యమైన స్థానం కలిగి ఉన్నాయి. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ పాలు పోషకాలు అందించే ఆహారంగా భావిస్తారు. శరీరానికి అవసరమైన అనేక పోషకాలు పాలలో ఉండటంతో ఆరోగ్యకరమైన జీవనానికి ఇది సహాయపడుతుంది. అందుకే ప్రతి రోజు పాలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పాలలో కాల్షియం, ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలు మరియు పళ్ల బలానికి చాలా ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎదుగుదల దశలో ఉన్న పిల్లలకు పాలు చాలా అవసరమని పేర్కొంటున్నారు. అలాగే పెద్దవారిలో కూడా ఎముకలు బలంగా ఉండటానికి పాలు సహాయపడతాయని చెబుతున్నారు. పాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుందని నిపుణులు అంటున్నారు. పాలు తాగడం వల్ల కండరాల బలం పెరగడంతో పాటు శరీరానికి అవసరమైన పోషకాలు సమతులంగా అందుతాయి. అలాగే పాలు జీర్ణక్రియకు కూడా సహాయపడతాయని చెబుతున్నారు. అయితే పాలను మితంగా తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. కొంతమందికి పాలు తాగితే జీర్ణ సమస్యలు కలిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అందువల్ల ప్రతి వ్యక్తి తన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పాలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. సమతుల ఆహారంలో భాగంగా పాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

# వ్యాధులపై రక్షణకు టీకాల ప్రాధాన్యం

- పోలియో నిర్మూలనకు చారిత్రాత్మక ప్రారంభం
- వ్యాధులను అరికట్టే శాస్త్రీయ రక్షణ
- ఆరోగ్యవంతమైన సమాజానికి టీకాల అవసరం

డెస్క్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి): ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో టీకాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి అనేక ప్రమాదకర వ్యాధుల నుంచి మనుషులను రక్షించడంలో టీకాలు ఒక శక్తివంతమైన ఆయుధంగా నిలుస్తున్నాయి. ఈ ప్రాముఖ్యతను గుర్తుచేసే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మార్చి 16న జాతీయ టీకా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. టీకాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రతి ఒక్కరూ టీకాలు తీసుకోవాలనే బాధ్యతను గుర్తుచేయడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. భారతదేశంలో పోలియో నిర్మూలనకు కీలకమైన అడుగు 1995లో వేసారు. అదే రోజున 'పల్స్ పోలియో' కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా చిన్నారులకు పోలియో చుక్కలు అందించడం ప్రారంభమైంది. ప్రభుత్వం, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు కలిసి భారీ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన పొందింది.

# మత్స్య సహకార సంఘానికి ఫర్నిచర్ పంపిణి





- ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కుర్చీలు ఒక టేబుల్ పంపిణి చేసిన ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

**రాయపర్తి, మార్చి 15,తరంగాలు :**మత్స్య సహకార సంఘానికి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఫర్నిచర్ పంపిణి చేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరు గ్రామంలో ఇటీవల పర్యటన లో మత్స్య సహకార సంఘం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశం లో మత్స్య సహకార సంఘం వారికి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కుర్చీలు, ఒక టేబుల్ ను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను శాలువతో సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజి జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, మాజీ సర్పంచ్ కర్ర రవీందర్ రెడ్డి, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, ఐత రామ్ చందర్, పెరటి యాదవ రెడ్డి, చందు లక్ష్మన్‌లి స్థానిక నాయకులు అయిన దేశబోయిన ఉపేందర్, పుల్ల ఎల్లగౌడ్, పూస కుమార్, శాస్త్రబోయిన యాకయ్య, సంఘము సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# డైటింగ్‌తో ఆరోగ్యానికి మేలు

- బరువు నియంత్రణలో డైటింగ్ ప్రాధాన్యం
- సరైన ఆహారపు అలవాట్లతో ఆరోగ్యకర జీవనం
- నిపుణులు సూచిస్తున్న జాగ్రత్తలు



**డెస్క్, 15 మార్చి (తరంగాలు ప్రతినిధి):** ఆధునిక జీవన విధానంలో అనేక మంది అధిక బరువు సమస్యతో బాధపడుతున్నారు. వ్యాయామం లేకపోవడం, అధిక కొవ్వు ఉన్న ఆహారం తీసుకోవడం, అసమయాల్లో భోజనం చేయడం వంటి కారణాల వల్ల బరువు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో బరువు నియంత్రణ కోసం చాలా మంది డైటింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు. సరైన పద్ధతిలో డైటింగ్ చేస్తే శరీర ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు అనేక వ్యాధులను నివారించవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డైటింగ్ అంటే పూర్తిగా తినకుండా ఉండటం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా సమతుల ఆహారం తీసుకోవడమే అసలు డైటింగ్ అని పేర్కొంటున్నారు. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, ప్రోటీన్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుందని చెబుతున్నారు. అదే సమయంలో అధిక కొవ్వు, చక్కెర ఉన్న ఆహారాన్ని తగ్గించడం అవసరమని సూచిస్తున్నారు. డైటింగ్ చేసే వారు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు మూడు పెద్ద భోజనాల బదులుగా చిన్నచిన్న పరిమాణాల్లో పలుమార్లు ఆహారం తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే రోజుకు తగినంత నీరు తాగడం, నిద్ర సరిగా తీసుకోవడం కూడా చాలా ముఖ్యమని పేర్కొంటున్నారు. వ్యాయామం లేదా నడక వంటి శారీరక కార్యకలాపాలు కూడా డైటింగ్ ఫలితాలను మెరుగుపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. అతి తక్కువ ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు తగ్గిపోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో అలసట, బలహీనత వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. అందువల్ల డైటింగ్ చేయాలనుకునే వారు నిపుణుల సలహా తీసుకుని సరైన ఆహార నియమాలను పాటిస్తే ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

# ఎండాకాలంలో సన్‌స్క్రీన్ అవసరం పెరుగుతోంది

- ఎండ తీవ్రతతో చర్మానికి ముప్పు
- అల్ట్రావయలెట్ కిరణాల నుంచి రక్షణకు సన్‌స్క్రీన్ కీలకం
- నిపుణులు సూచిస్తున్న జాగ్రత్తలు



**డెస్క్, 15 మార్చి ( తరంగాలు ప్రతినిధి):** ఎండాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సూర్య కిరణాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బయట తిరిగే వారికి చర్మ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అల్ట్రావయలెట్ కిరణాల ప్రభావంతో చర్మం నల్లబడటం, ఎండదెబ్బ, చర్మం ఎండిపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చర్మాన్ని రక్షించుకోవడానికి సన్‌స్క్రీన్ వినియోగం చాలా అవసరమని సూచిస్తున్నారు. సూర్యకిరణాల్లో ఉండే అల్ట్రావయలెట్ కిరణాలు చర్మంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇవి ఎక్కువగా పడితే చర్మం రంగు మారడం, మచ్చలు ఏర్పడటం, కొన్నిసార్లు తీవ్రమైన చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రభావాన్ని తగ్గించడంలో సన్‌స్క్రీన్ ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇది చర్మంపై ఒక రక్షణ పొరలా పనిచేసి కిరణాల ప్రభావాన్ని తగ్గిస్తుంది. సన్‌స్క్రీన్‌ను ఉపయోగించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లే ముందు సుమారు 15 నుంచి 20 నిమిషాల ముందు సన్‌స్క్రీన్ రాయడం మంచిదని చెబుతున్నారు. అలాగే ఎండలో ఎక్కువసేపు ఉంటే రెండు గంటలకు ఒకసారి మళ్లీ రాయడం అవసరమని పేర్కొంటున్నారు. ముఖంతో పాటు మెడ, చేతులు, చెవులు వంటి బయటకు కనిపించే భాగాలకూ సన్‌స్క్రీన్ రాయడం ద్వారా చర్మాన్ని సమగ్రంగా రక్షించుకోవచ్చు. ఎండాకాలంలో సన్‌స్క్రీన్‌తో పాటు ఇతర జాగ్రత్తలు కూడా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 11 నుంచి 3 గంటల మధ్య ఎండ తీవ్రంగా ఉండే సమయంలో బయట తిరగడం తగ్గించడం మంచిదని చెబుతున్నారు. తేలికపాటి బట్టలు ధరించడం, ఎక్కువగా నీళ్లు తాగడం, పండ్లు తినడం వంటి అలవాట్లు కూడా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయని నిపుణులు సూచిస్తున్నారు.

# అరటిపండు ఆరోగ్యానికి వరం

- పోషకాలు సమృద్ధిగా ఉన్న పండు
- శరీరానికి తక్షణ శక్తి అందించే ఆహారం
- ప్రతిరోజూ మితంగా తీసుకోవాలని నిపుణుల సూచన

**డెస్క్, 15 మార్చి ( తరంగాలుప్రతినిధి):** మన దేశంలో ఎక్కువగా లభించే పండ్లలో అరటిపండు ముఖ్యమైనది. తక్కువ ధరలో సులభంగా అందుబాటులో ఉండటంతో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ పండును ఇష్టంగా తింటారు. ఆరోగ్యానికి ఉపయోగకరమైన అనేక పోషకాలు ఇందులో ఉండటంతో అరటిపండును రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం, పీచు పదార్థం, విటమిన్ బి ఆరు, విటమిన్ సి వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా వ్యాయామం చేసిన తర్వాత లేదా అలసటగా ఉన్నప్పుడు అరటిపండు తింటే తక్షణ శక్తి లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా ఉపయోగపడుతుందని



THARANGALU DAILY NEWS
సోమవారం, 16 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# సీబీఎస్సీ కీలక నిర్ణయం

- పశ్చిమాసియా దేశాల్లో 12వ తరగతి పరీక్షలు రద్దు
- యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం
- కొత్త తేదీలను త్వరలో ప్రకటించనున్న బోర్డు



**డెస్క్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సీబీఎస్సీ కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 16 నుంచి జరగాల్సిన 12వ తరగతి బోర్డు పరీక్షలను ఆ ప్రాంతంలోని పలు దేశాల్లో పూర్తిగా రద్దు చేస్తున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ప్రకటించింది. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు తెలిపింది. ప్రస్తుతం ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్త పరిస్థితుల కారణంగా పశ్చిమాసియా దేశాల్లో భద్రతా పరిస్థితులు అనిశ్చితంగా మారాయి. ఈ నేపథ్యంలో బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల్లో నిర్వహించాల్సిన 12వ తరగతి పరీక్షలను సీబీఎస్సీ రద్దు చేసింది. ఈ దేశాల్లో ఉన్న 150కు పైగా సీబీఎస్సీ అనుబంధ పాఠశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 10 వరకు జరగాల్సిన మిగిలిన అన్ని పరీక్షలను రద్దు చేస్తున్నట్లు సర్క్యులర్‌లో పేర్కొంది. ఫలితాల ప్రకటనకు సంబంధించిన విధానాన్ని త్వరలో ప్రత్యేకంగా వెల్లడిస్తామని సీబీఎస్సీ పరీక్షల నియంత్రణ అధికారి సంయమ్ భరద్వాజ్ తెలిపారు. ఇప్పటికే ఫిబ్రవరి 17 నుంచి 28 వరకు జరిగిన పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని, తరువాత ప్రారంభమైన యుద్ధ పరిస్థితుల కారణంగా మార్చి 1 నుంచి జరగాల్సిన పరీక్షలను పలు దఫాలుగా వాయిదా వేసిన తర్వాత చివరకు రద్దు చేయాలని నిర్ణయించినట్లు బోర్డు వెల్లడించింది.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

- కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్
- టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం
- ఒకే రోజు 85 వేలకుపైగా భక్తుల దర్శనం



**తిరుమల, మార్చి 16 ( తరంగాలు ప్రతినిధి):** వారాంతపు సెలవు దినాల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకోవడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. భక్తులతో కంపార్టుమెంట్లు పూర్తిగా నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్లు కొనసాగుతున్నాయి. టీటీడీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనం పొందేందుకు సుమారు 18 గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శన ఏర్పాట్లను అధికారులు సమర్థంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శనివారం రోజున మాత్రమే మొత్తం 85,132 మంది భక్తులు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. ఇదే సమయంలో 38,855 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు భక్తులు సమర్పించిన కానుకలతో ఆలయ హుండీ ఆదాయం కూడా గణనీయంగా నమోదైంది. శనివారం ఒక్కరోజే హుండీ ద్వారా రూ.3.62 కోట్ల ఆదాయం వచ్చినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో తిరుమలలో భద్రతా, నిర్వహణ ఏర్పాట్లను మరింత పటిష్టం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# హోంబలే సినిమాలు అవేనట?

పానిండియా రెబల్‌స్టార్ ప్రభాస్‌తో ప్రతిష్టాత్మక చిత్రనిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మూడు సినిమాలు నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ప్రభాస్‌కు భారీ మొత్తంలో అడ్వాన్స్‌ను కూడా వారు అందించినట్టు ఓ వార్త కొన్నిరోజుల క్రితం మీడియాను షేక్ చేసింది. అయితే, ఆ మూడు సినిమాలు ఏంటి? దర్శకులెవరు? అనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. తాజా సమాచారం ప్రకారం ఈ వ్యవహారంపై క్లారిటీ వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ మూడు సినిమాల్లో మొదటిది 'సలార్2: సౌర్యాంగపర్వం'. ప్రభాస్‌తో హోంబలే వారే 'సలార్' చిత్రాన్ని నిర్మించారు. ఆ సినిమా భారీ సక్సెస్ సాధించింది. ప్రభాస్‌తో వారు కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ముందు నిర్మించే సినిమా 'సలార్ 2' అని తెలిసింది. ఇక రెండో సినిమా.. మలయాళంలో కిష్కింధకాండ, ఏకో చిత్రాలను తెరకెక్కించిన దింజిత్ అయ్యథాన్ దర్శకత్వంలో ఉంటుందట. దీనికి సంబంధించిన కథను కూడా సదరు దర్శకుడు సిద్ధంచేశారట. అలాగే 'అమరన్'ఫేం రాజ్‌కుమార్ పెరియసామి కూడా ఇటీవలే ప్రభాస్‌కి ఓ కథ వినిపించారట. దాదాపు ప్రభాస్‌తో హోంబలే నిర్మించే మూడు సినిమాలు ఇవే అవుతాయని వినికిడి. అయితే ప్రభాస్ మాత్రం ప్రస్తుతం స్పిరిట్, ఫౌజీ, కల్కి 2 షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. అవి పూర్తయితే తప్ప నెక్ట్స్ కమిట్‌మెంట్స్ గురించి ఆయన ఆలోచించలేరు.

# వ్యాధులపై రక్షణకు టీకాల ప్రాధాన్యం

- పోలియో నిర్మూలనకు చారిత్రాత్మక ప్రారంభం
- వ్యాధులను అరికట్టే శాస్త్రీయ రక్షణ
- ఆరోగ్యవంతమైన సమాజానికి టీకాల అవసరం



**డెస్క్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో టీకాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి అనేక ప్రమాదకర వ్యాధుల నుంచి మనుషులను రక్షించడంలో టీకాలు ఒక శక్తివంతమైన ఆయుధంగా నిలుస్తున్నాయి. ఈ ప్రాముఖ్యతను గుర్తుచేసే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మార్చి 16న జాతీయ టీకా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. టీకాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రతి ఒక్కరూ టీకాలు తీసుకోవాలనే బాధ్యతను గుర్తుచేయడం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. భారతదేశంలో పోలియో నిర్మూలనకు కీలకమైన అడుగు 1995లో వేసారు. అదే రోజున 'పల్స్ పోలియో' కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా చిన్నారులకు పోలియో చుక్కలు అందించడం ప్రారంభమైంది. ప్రభుత్వం, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు కలిసి భారీ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందన పొందింది. గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ప్రతి ఇంటికి చేరుకుని చిన్నారులకు పోలియో చుక్కలు అందించడం జరిగింది. వేలాది మంది వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, స్వచ్ఛంద సేవకులు కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తల్లిదండ్రులు కూడా ముందుకు రావడంతో పోలియో వ్యాధి నియంత్రణలో కీలకమైన మార్పు కనిపించింది. పోలియో ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది చిన్నారులను వికలాంగులుగా మార్చిన ప్రమాదకర వ్యాధి. అయితే టీకా కార్యక్రమాల వల్ల ఈ వ్యాధిని అరికట్టడం సాధ్యమైంది. భారతదేశం కూడా నిరంతర కృషి ఫలితంగా పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందింది. ఇది దేశ ఆరోగ్య రంగానికి ఒక గొప్ప విజయంగా నిలిచింది.

టీకాలు కేవలం పోలియో మాత్రమే కాకుండా అనేక ఇతర వ్యాధుల నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి. క్షయవ్యాధి, డిప్తీరియా, టెటనస్, మీజిల్స్, హెపటైటిస్ వంటి ప్రమాదకర వ్యాధులను టీకాల ద్వారా ముందుగానే నివారించవచ్చు. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి వ్యాధులు దాడి చేయకుండా కాపాడే శక్తి టీకాలకు ఉంది. ప్రత్యేకంగా చిన్నారుల ఆరోగ్య రక్షణలో టీకాలు అత్యంత కీలకంగా భావిస్తారు. పుట్టిన వెంటనే పిల్లలకు వివిధ దశల్లో టీకాలు ఇవ్వడం ద్వారా వారి ఆరోగ్యాన్ని భద్రపరచవచ్చు. ప్రభుత్వాలు కూడా పిల్లల కోసం ప్రత్యేక టీకా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. దేశవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య శిబిరాల ద్వారా ప్రజలకు ఉచితంగా టీకాలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి టీకాలు వేయించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. టీకాలు వేయించుకోవడం వల్ల కేవలం వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాదు, సమాజ ఆరోగ్య భద్రత కూడా మెరుగుపడుతుంది. ఒక సమాజంలో ఎక్కువ మంది టీకాలు తీసుకుంటే వ్యాధుల వ్యాప్తి తగ్గుతుంది. దీంతో మొత్తం సమాజం సురక్షితంగా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. జాతీయ టీకా దినోత్సవం సందర్భంగా వైద్య నిపుణులు, ఆరోగ్య అధికారులు ప్రజలకు టీకాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. అపోహలు, భయాలు దూరం చేసి ప్రతి ఒక్కరూ టీకాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా సమయానికి టీకాలు వేయించుకోవడం ఎంతో అవసరం. ఆరోగ్యవంతమైన భారత నిర్మాణానికి టీకాలు ఒక బలమైన రక్షణ కవచంగా నిలుస్తున్నాయి. వ్యాధులు వచ్చే ముందు నుంచే వాటిని అరికట్టే శక్తి టీకాలకు ఉంది. అందుకే ప్రతి కుటుంబం టీకాల ప్రాముఖ్యతను గుర్తించి పిల్లలకు సమయానికి టీకాలు వేయించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తు నిర్మించుకోవాలి.

# అస్సాంలో ఆరోగ్య రంగానికి భారీ ప్రోత్సాహం






- 2,092 కోట్ల ఆరోగ్య ప్రాజెక్టులకు శ్రీకారం
- వాయువ్య భారతంలో వైద్య సేవలకు కొత్త దిశ
- రాష్ట్ర అభివృద్ధికి కీలక అడుగుగా అభివర్ణించిన అమిత్ షా

**గువాహటి, మార్చి 15 ( తరంగాలు ప్రతినిధి):** అస్సాం రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు వేగం పుంజుకుంటున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య సదుపాయాలను అభివృద్ధి చేసే దిశగా రూ.2,092 కోట్ల విలువైన పలు ఆరోగ్య ప్రాజెక్టులను ప్రారంభించడం మరియు వాటికి శంకుస్థాపన చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు వాయువ్య భారతదేశంలో వైద్య సేవలను మరింత విస్తరించే దిశగా కీలకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. అస్సాం రాష్ట్రం ఆరోగ్య సేవల రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతూ వాయువ్య భారతానికి వైద్య కేంద్రంగా మారుతోందని అమిత్ షా పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఆసుపత్రులు, వైద్య పరికరాలు, నూతన ఆరోగ్య సదుపాయాల ఏర్పాటు ద్వారా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని దూర ప్రాంతాల ప్రజలకు కూడా మెరుగైన చికిత్స అందే విధంగా వైద్య మౌలిక వసతులను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. ఈ భారీ ఆరోగ్య ప్రాజెక్టులు అమలులోకి రావడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కృషి ముఖ్యమని ఆయన ప్రశంసించారు. రాష్ట్ర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఆరోగ్య రంగంలో పెట్టుబడులు పెరగడం వల్ల ప్రజలకు మెరుగైన చికిత్స మాత్రమే కాకుండా వైద్య రంగంలో కొత్త అవకాశాలు కూడా ఏర్పడతాయని తెలిపారు. అస్సాం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు అమలవుతున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుతాయని, అస్సాం అభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# హెలిప్యాడ్‌లోకి ఆవు
# అధికారుల్లో గందరగోళం

- సీఎం హెలికాప్టర్ ల్యాండింగ్‌కు ముందు ఊహించని ఘటన
- భద్రతా సిబ్బందిని పరుగులు పెట్టించిన ఆవు
- సోషల్ మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో





**బీహార్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** బీహార్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్‌కు ముందు చోటుచేసుకున్న ఓ విచిత్ర ఘటన సోషల్ మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కార్యక్రమం కోసం బెగుసరాయ్ జిల్లాకు రావాల్సి ఉండగా హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఒక ఆవు అకస్మాత్తుగా లోపలికి ప్రవేశించడం కలకలం రేపింది. సమృద్ధి యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో బెగుసరాయ్‌లోని పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి సంస్థ ప్రాంగణానికి రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు హెలిప్యాడ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీసులు, ఇతర అధికారులు హెలికాప్టర్ రాక కోసం వేచి ఉన్న సమయంలో ఊహించని సంఘటన జరిగింది. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియని ఒక ఆవు ఒక్కసారిగా బారికేడ్లు దాటి హెలిప్యాడ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. ఆవు వేగంగా అక్కడి ప్రాంగణంలో పరుగులు తీయడంతో భద్రతా సిబ్బంది కంగారు పడ్డారు. ఆవును బయటకు పంపేందుకు పోలీసులు ప్రయత్నించగా కొంతసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. కొంతసేపటి తర్వాత ఆవు అక్కడి నుంచి బయటకు వెళ్లిపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ముఖ్యమంత్రి రాకకు ముందే పరిస్థితి సాధారణంగా మారింది. అయితే ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మాధ్యమాల్లో వైరల్ అవుతూ విస్తృతంగా చర్చకు దారితీస్తోంది.

THARANGALU DAILY NEWS
సోమవారం, 16 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## మాజీ డీజీపీ హెచ్.జే. దొర నివాసానికి బండి సంజయ్

- కుటుంబ సభ్యులను పరామర్శించిన కేంద్ర మంత్రి
- పోలీస్ సేవలను గుర్తుచేసుకున్న బండి సంజయ్
- సాహసోపేత సేవలను కొనియాడిన కేంద్ర నాయకుడు



**హైదరాబాద్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్.జే. దొర నివాసానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ పోలీసు విభాగంలో హెచ్.జే. దొర చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో తీవ్రవాదాన్ని ఎదుర్కొనే క్రమంలో ఆయన చూపిన ధైర్యం, నాయకత్వం పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. పోలీసు వ్యవస్థలో నిజాయితీతో పనిచేసిన అధికారిగా దొర పేరు నిలిచిపోయిందని చెప్పారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం మహానిర్వాహకుడిగా కూడా ఆయన దేశానికి కీలక సేవలు అందించారని గుర్తు చేశారు. అతని సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొంటూ దొర కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## తెలంగాణలో నేడు, రేపు వర్షాలు

- ఉరుములు, మెరుపులతో వర్షాల హెచ్చరిక
- ఈదురుగాలులతో కొన్ని జిల్లాల్లో వర్షం అవకాశం
- ద్రోణి ప్రభావంతో మారిన వాతావరణం



**హైదరాబాద్, మార్చి 15 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలో ఆదివారం, సోమవారం రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణ పరిస్థితులు మారే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని పేర్కొంది. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తేమ గాలులు రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయని వాతావరణ శాఖ వివరించింది. ఈ కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మేఘావృత పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో చల్లని గాలులు కూడా వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచుతున్నాయని అధికారులు తెలిపారు. వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. ముఖ్యంగా రైతులు పంటలను రక్షించుకునే చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## హాలీవుడ్ లెవల్లో బైకర్

'బలమైన భావోద్వేగాలుండే అద్భుతమైన స్క్రిప్ట్ 'బైకర్' ' అంటున్నారు సంగీత దర్శకుడు జిబ్రాన్. ఆయన సంగీతం అందిస్తున్న ఈ స్పోర్ట్స్ డ్రామాకు హీరో శర్వానంద్. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు జిబ్రాన్ ఆదివారం మీడియాతో మాట్లాడారు.'శర్వానంద్ 'రన్ రాజా రన్'తోనే సంగీత దర్శకుడిగా పరిచయం అయ్యాను. మళ్లీ ఆయనతో పనిచేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా మేకింగ్ హాలీవుడ్ లెవల్లో ఉంటుంది. ప్రతి క్రీడాకారుడి కుటుంబంలో ఉండే ఎమోషన్సే ఇందులో కనిపిస్తాయి. ఇదొక తండ్రీకొడుకల కథ. రేసింగ్‌నీ, ఎమోషన్స్‌ని దర్శకుడు బాగా బ్లెండ్ చేశాడు. సినిమా బాగా వచ్చింది. ముఖ్యంగా రేసింగ్ సన్నివేశాలు ఆడియన్‌ని సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడతాయ్.ఇలాంటి సినిమాకు ఎలాంటి మ్యూజిక్ అవసరమో అలా బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించాం' అని చెప్పారు జిబ్రాన్. రేసింగ్ టైమ్‌లో సౌండ్ ఎక్కువగా ఉంటుందని, దానివల్ల మ్యూజిక్ వినిపించకుండా పోకూడదని ఓ కొత్త టెక్నాలజీని ఉపయోగించి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చేశామని, శర్వా పర్‌ఫార్మెన్స్ ఇందులో నెక్స్ట్ లెవల్లో ఉంటుందని, దర్శకుడు అభిలాష్ క్లారిటీతో ఈ సినిమాను తెరకెక్కించారని, ప్రస్తుతం తమిళంలో 'లీడర్'అనే సినిమా కూడా చేస్తున్నానని జిబ్రాన్ తెలిపారు.

# డ్రగ్స్ పార్టీలో ఎంపీ పట్టుబడటం సిగ్గుచేటు

- పుట్టా మహేశ్ వ్యవహారంపై శర్మిల విమర్శలు
- తక్షణమే అనర్హత వేటు వేయాలని డిమాండ్
- టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని చంద్రబాబుకు సవాల్



**అమరావతి, మార్చి 16 (తరంగాలు ప్రతినిధి):** మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ పట్టుబడిన ఘటనపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ శర్మిల తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఒక ఎంపీ డ్రగ్స్ పార్టీలో పట్టుబడటం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సామాజిక మాధ్యమాల్లో స్పందించిన శర్మిల, ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎంపీ డ్రగ్స్ విందులో పాల్గొనడం దారుణమని పేర్కొన్నారు. ప్రజల నమ్మకంతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండగా ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళనకరమని అన్నారు. డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని ఆమె ప్రశ్నించారు. డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన ప్రజా ప్రతినిధులు సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారని శర్మిల నిలదీశారు. ముఖ్యంగా యువతకు ఇది తప్పు సందేశాన్ని ఇస్తుందని ఆమె అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు బాధ్యతతో వ్యవహరించాల్సి ఉండగా ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ తీసుకువస్తాయని పేర్కొన్నారు. ఏలూరు ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన ఎంపీ ఈ ఘటనపై వారికి ఏం సమాధానం చెబుతారని శర్మిల ప్రశ్నించారు. డ్రగ్స్‌పై నిజంగా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలనుకుంటే ముందుగా తమ పార్టీకి చెందిన ఎంపీపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. టీడీపీ నుంచి పుట్టా మహేశ్ కుమార్ యాదవ్‌ను వెంటనే సస్పెండ్ చేసి, అనర్హత వేటు వేయాలని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే ఈ ఘటనపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె సవాల్ విసిరారు.

# ఎర్రబెల్లి స్వర్ణ ప్రమాణ స్వీకార మహోత్సవానికి తరలివెళ్లిన వర్ధన్నపేట మహిళా కాంగ్రెస్ నేతలు



**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 15,తరంగాలు** :హైదరాబాద్ గాంధీనగర్ లోని ప్రకాశం హాల్లో టీపీసీసీ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు,జిల్లా అధ్యక్షులు కర్ణకంటి పార్వతమ్మ ఆదేశాల మేరకు వర్ధన్నపేట మండల మహిళా అధ్యక్షురాలు మరపట్ల అరుణ సాయి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తీగల సునీత గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కర్ర మలత రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు,గ్రామ పార్టీ అధ్యక్షులు మహిళలతో పెద్ద సంఖ్యలో వర్ధన్నపేట నుండి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల మహిళా నాయకురాళ్లు , కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



# 102 పైలెట్ ఆనంద్ రాజ్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**నాగర్ కర్నూల్, మార్చి 15,తరంగాలు** :102 పైలెట్ ఆనంద్ రాజ్ కుటుంబానికి 102 నడిపే తోటి పైలెట్ లు ఆర్థిక సహాయం అందజేసి ఆ కుటంబానికి అండగా నిలిచారు.నాగర్ కర్నూల్ జిల్లా, వెల్దండ మండలం, చదరవల్లి గ్రామానికి చెందిన ఆనంద్ రాజ్ 102 పైలెట్ గా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు.తెలంగాణ రాష్ట్ర పైలెట్ లు అందరూ తలా కొంత పోగుచేశారు.ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు సముద్రాల మధు ఆధ్వర్యంలో ఆనంద్ రాజ్ భార్య కు 38,500 రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ, నీలోఫర్, కొర్ని యాదగిరి,సురేష్,అరుణ్ తదితరులు పాసల్గొన్నారు.



## వరల్డ్‌కప్ టీమ్‌లకు బీసీసీఐ ఘన సత్కారం

న్యూఢిల్లీ: బీసీసీఐ వార్షిక అవార్డుల వేడుక అట్టహాసంగా జరిగింది. అతిరథ మహారథుల సమక్షంలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో క్రికెటర్లు సందడి చేశారు. 2025-26 సీజన్‌లో ఏకంగా ఐదు ఐసీసీ ట్రోఫీలతో కొత్త చరిత్ర లిఖిం చిన భారత క్రికెటర్ల ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది. ఇందుకు తోడు దేశ క్రికెట్‌కు ఎనలేని సేవలు అందించిన దిగ్గజ ప్లేయర్లు రోజర్ బిన్నీ, రాహుల్ ద్రవిడ్, మిథాలీరాజ్‌ను బీసీసీఐ ఘనంగా సన్మానించింది. కండ్లు మిరుమిట్లు గొలిపే రీతిలో 'నమన్' అవార్డుల వేడుక యువకులు, అనుభవజ్ఞుల కలయికగా జరిగింది. గత సీజన్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన టీమ్‌ఇండియా వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్‌గిల్‌తో పాటు మహిళల క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేకతను లిఖించుకున్న స్మృతి మంధాన అంతర్జాతీయ అత్యుత్తమ క్రికెటర్ల అవార్డులు కైవసం చేసుకున్నారు.

ముఖ్యంగా కెప్టెన్‌గా తొలిసారి ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో గిల్ అంచనాలకు మించి రాణిం చాడు. సిరీస్‌లో పది ఇన్నింగ్స్‌లో 75.40 సగటుతో 754 పరుగులు చేసి టోర్నీ టాపర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లను వారి సొంతగడ్డపైనే దీటుగా నిలువరిస్తూ సిరీస్ 2-2తో డ్రా కావడంలో కీలకంగా వ్యవహరించాడు. ఇంగ్లిష్ పిచ్‌లపై అంతగా ఆడిన అనుభవం లేకపోయినా దిగ్గజాల గైర్హాజరీలో గిల్ దుమ్మురేపాడు. తన దూకుడైన బ్యాటింగ్‌తో ఓ డబుల్ సెంచరీ(269) సహా నాలుగు సెంచరీలు ఖాతాలో వేసుకున్నాడు. గతేడాది దుబాయ్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలోనూ గిల్ అదరగొట్టాడు.వన్డేల్లో నంబర్‌వన్ ర్యాంక్ బ్యాటర్‌గా బరిలోకి దిగిన గిల్..బంగ్లాదేశ్‌పై అజేయ సెంచరీ(101 నాటౌట్) సహా టోర్నీలో 188 పరుగులతో టీమ్‌ఇండియా ట్రోఫీ విజయంలో కీలకమయ్యాడు. పాలీ ఉమ్రిగర్ అవార్డు విజేతగా నిలిచిన గిల్ స్పందిస్తూ 'ఈ అవార్డు కోసం బీసీసీఐ నన్ను గుర్తించినందుకు ధన్యవాదాలు. ఎంతో మంది దిగ్గజ క్రికెటర్లు ఈ అవార్డును సొంతం చేసుకున్నారు.